సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం : 29 : ఆగస్టు : 2025



మత్తడివాగు గేట్లు ఎత్తివేత

భారీ వర్షాలకు తాంసి మండలంలోని మత్తడివాగు ప్రాజెక్ట్‌లోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. అధికారులు నాలుగు గేట్లు ఎత్తి నీటిని దిగువకు వదులుతున్నారు. 8లో▸



మట్టి గణపతుల పంపిణీ

వినాయక చవితి సందర్భంగా పలు సంఘాలవారు మట్టి గణపతులను పంపిణీ చేశారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి ప్రతిమలనే వినియోగించాలని సూచించారు. 9లో▸

గరిష్టం/కనిష్టం
28.0/24.0

వాతావరణం

సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఆకాశం మేఘావృతమవుతుంది. మోస్తారు నుంచి భారీ వర్షం కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

అర్థమయ్యే రీతిలో బోధించాలి

నేరడిగొండ: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని డీఐఈవో జాదవ్ గణేశ్‌కుమార్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఇంటర్ బోర్డు నిర్వహిస్తున్న ఆన్‌లైన్ తరగతులను పరిశీలించారు. అనంతరం లెక్చరర్లతో సమావేశమై మాట్లాడారు. విద్యార్థుల హాజరు పెంచాలని ఆదేశించారు. ప్రిన్సిపాల్ షబానా తరన్నుమ్, లెక్చరర్లు సుభాష్, ప్రవీణ్ తదితరులున్నారు.

అప్రమత్తంగా ఉండాలి

నేరడిగొండ: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని అడిషనల్ డీఎంహెచ్‌వో మనోహర్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో వైద్యశిబిరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట హెచ్‌ఈవో పవార్ రవీందర్, సీనియర్ అసిస్టెంట్ మోహన్, బాపూజీ, ఎంఎల్‌హెచ్‌పీ వాణి, ల్యాబ్ టెక్నీషియన్ ఉత్తమ్‌సింగ్, సాయన్న, నర్సయ్య తదితరులున్నారు.

విద్యాసంస్థల సందర్శన

ఆదిలాబాద్‌రూరల్: వర్షాలు కురుస్తున్నందున గురువారం ఆదిలాబాద్ రూరల్ మండలం బంగారుగూడ, చాందా (టి) సమీపంలోగల బాలికలు, బాలుర రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలను జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి షేక్ ఖలీం సందర్శించారు. చాందా (టి) సమీపంలోని గురుకుల పాఠశాలలోకి నీరు రావడంతో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని తెలిపారు. వంటగదిని పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో పలువురు విద్యార్థినులు అనారోగ్యంతో బాధపడుతుండగా వెంటనే వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. పలువురిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రికి తరలించి రక్త పరీక్షలు చేయించారు. ఆయన వెంట డీఎంహెచ్‌వో నరేందర్, డిప్యూటీ డీఎంహెచ్‌వో సాధన, మండల వైద్యాధికారి సర్ఫరాజ్, వైద్య సిబ్బంది, ఆయా పాఠశాలల ప్రిన్సిపాల్‌లు, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం ఉపాధ్యాయులు ఈనెల 30లోపు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ఖుష్బూ గుప్తా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూళ్లు, కేజీబీవీలు, ప్రభుత్వ, జెడ్పీ, మండల పరిషత్ పాఠశాలలకు సంబంధించి ఆయా కేటగిరీల్లో మండలానికి ముగ్గురు చొప్పున ఉపాధ్యాయులను ఎంపిక చేసి సెప్టెంబర్ 2లోపు డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని ఎంఈవోలకు సూచించారు.

రెవెన్యూ గ్రామంగా మార్చాలి

ఆదిలాబాద్: నార్నూరు మండలంలోని కొత్తపల్లి (హెచ్)ని రెవెన్యూ గ్రామంగా మార్చాలని స్థానికులు ఎంపీ గోడం నగేశ్‌ను కోరారు. జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం ఎంపీని కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలోని శ్రీహనుమాన్ ఆలయ ప్రహరీ నిర్మాణానికి ఎంపీ రూ.5లక్షలు మంజూరు చేసినట్లు గ్రామస్తుడు చౌహాన్ దిగంబర్ ఈ సందర్భంగా తెలిపారు. ఎంపీని కలిసిన వారిలో నాయకులు గుణవంతురావు, శ్యామారావు, కేశవ్, దీపక్, ప్రవీణ్ నాయక్ తదితరులున్నారు.

కల్వర్టు నిర్మించాలని అంతర్రాష్ట్ర రహదారిపై రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

తలమడుగు: మండలంలోని కోడద్ గ్రామ సమీపంలోగల పీహెచ్‌సీ వద్ద కల్వర్టు నిర్మించాలని గ్రామస్తులు వర్షాన్ని కూడా లెక్కచేయకుండా గురువారం అంతర్రాష్ట్ర రహదారిపై ఆరుగంటల పాటు రాస్తారోకో చేశారు. దీంతో రోడ్డుకు ఇరువైపులా రెండు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచి ట్రాఫిక్ అంతరాయమేర్పడింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారీ వర్షాలకు గ్రామంలోని 30 ఇళ్లలోకి వరద నీరు చేరి నిత్యావసరాలు, ఆహార పదార్థాలు తడిచి పోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలిపినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేసేదాకా రాస్తారోకో కొనసాగిస్తామని హెచ్చరించారు. తహసీల్దార్ రాజ్‌మోహన్, ఎస్సై రాధిక, ఎంపీడీవో శంకర్ విషయం జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఉన్నతాధికారులు స్పందించి కల్వర్టు నిర్మాణానికి వెంటనే రూ.20 లక్షల నిధులు మంజూరు చేయడంతో గ్రామస్తులు రాస్తారోకో విరమించారు.

గణాధిపతికి ఘనస్వాగతం



జిల్లా కేంద్రంలోని శిశుమందిర్‌లో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

జిల్లా కేంద్రంలో పూజలు నిర్వహిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్



నేరడిగొండలో పూజలు చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్



గణేశ్ నవరాత్రోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభమయ్యాయి. ఊరూరా, వాడవాడలా అందంగా అలంకరించిన మండపాల్లో కొలువుదీరిన గణనాథుడు భక్తుల పూజలందుకుంటున్నాడు. జిల్లా కేంద్రంలోని ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఎస్పీ అఖిల్ మహాజన్, శ్రీసరస్వతి శిశుమందిర్‌లో ఎమ్మెల్యే పాయల్ శంకర్, నేరడిగొండలోని తన నివాసంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వినాయకుడికి పూజలు చేశారు. – ఆదిలాబాద్/నేరడిగొండ

అతలాకుతలం

- రెండ్రోజులుగా కురుస్తున్న వాన
- ఉప్పొంగిన వాగులు, వంకలు
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- పలుచోట్ల నిలిచిన రాకపోకలు
- ప్రాజెక్టుల్లోకి భారీగా వరదనీరు



బజార్‌హత్నూర్: కొలారిలో ఇళ్లలోకి వచ్చిన వరద నీరు

జిల్లాలో వర్షపాతం వివరాలు (జూన్ 1 నుంచి ఆగస్టు 28 వరకు..)

సాధారణం	794.8 మి.మీ.లు
కురిసింది	886.4 మి.మీ.లు
వ్యత్యాసం	12 శాతం అధికం
స్థితి	సాధారణం

మండలాల వారీగా ఆగస్టు 28న వర్షపాతం (మి.మీ.లలో)

జైనథ్	110
ఆదిలాబాద్‌రూరల్	96.4
మావల	92.6
నేరడిగొండ	89.8
ఆదిలాబాద్‌అర్బన్	88.4
బేల	72.2
తాంసి	62.4
బోథ్	58.4
నార్నూర్	51.4
తలమడుగు	47.6
ఉట్నూర్	42.2



కైలాస్‌నగర్: సుభాష్‌నగర్ లోలెవల్ బ్రిడ్జిపై పారుతున్న నీరు

ప్రాజెక్ట్	నీటిమట్టం (మీటర్లలో)	ప్రస్తుత నీటిమట్టం (మీటర్లలో)	నీటి సామర్థ్యం (టీఎంసీలలో)	ప్రస్తుత నీటి సామర్థ్యం (టీఎంసీలలో)	ఇన్‌ఫ్లో (క్యూసెక్కులలో)
సాత్నాల	286.50	285.50	1.24	0.841	4,500
మత్తడివాగు	277.50	277.40	0.470	0.451	22,858



ఉట్నూర్ రూరల్: ప్రమాదకరంగా రోడ్డు దాటుతున్న గిరిజనులు



తలమడుగు: పొంగిపొర్లుతున్న తలమడుగు వాగు

సాక్షి, ఆదిలాబాద్: బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా జిల్లాలో బుధ, గురువారాల్లో భారీ వర్షాలు కురిశాయి. దీంతో వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. పలు చోట్ల రహదారులపై భారీగా వరదనీరు వెళ్తుండగా రాకపోకలు నిలిచాయి. కొన్నిచోట్ల రోడ్లు కోతకు గురయ్యాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పలు కాలనీలు నీట మునగగా ఇళ్లలోకి నీరు చేరి జనం తిప్పలు పడ్డారు. కుంటాల, పొచ్చెర, గాయత్రి జలపాతాలకు వరదనీరు పోటెత్తింది. పెన్‌గంగకు కూడా వరద ఉధృతి క్రమంగా పెరుగుతోంది. మరోవైపు సాత్నాల, మత్తడివాగు ప్రాజెక్టులకు వరదనీరు పెద్ద ఎత్తున వస్తోంది. మత్తడివాగు ప్రాజెక్టు ఐదు గేట్లలో నాలుగింటిని ఎత్తి దిగువకు నీటిని వదిలారు. సాత్నాల ప్రాజెక్ట్ నాలుగు గేట్లలో మూడింటిని ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. జిల్లాలోని చెరువులన్నీ అలుగు పారుతున్నాయి. బుధవారం నుంచి గురువారం ఉదయం వరకు జిల్లాలో సగటున 55.4 మి.మీ వర్షపాతం నమోదైంది. ఈ వర్షాకాలం సీజన్‌లో జిల్లాలో జూన్, జూలై మాసాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఆగస్టులో మాత్రం భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తున్నాయి. గురువారం సాయంత్రం 4గంటలకు జిల్లాకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. దీంతో శుక్రవారం కూడా జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశముంది. కాగా, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

జిల్లా వ్యాప్తంగా ఇదీ పరిస్థితి

జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్, కృష్ణానగర్, దుర్గానగర్ లోలెవల్ వంతెనలపై వరదనీరు ప్రవహించింది. ప్రధాన చౌరస్తాలన్నీ పూర్తిగా జలమయమయ్యాయి. ఖుర్షాపూర్ కాలనీకి చెందిన అజీముద్దీన్ ఇంటి గోడ కూలింది. తలమడుగు మండలం దేవాపూర్ చెరువు సమీపంలో రహదారి కోతకు గురైంది. ఉట్నూర్‌లోని పలు కాలనీలను వరద ముంచెత్తింది. వంకతుమ్మ, నర్సాపూర్, మానిక్‌గూడ గ్రామాల వాగులు ఉధృతంగా ప్రవహించగా రాకపోకలు నిలిచిపోయాయి. భీంపూర్ మండలంలోని నిపాని వాగు ఉప్పొంగగా రాకపోకలు నిలిచాయి. భారీ వరద కారణంగా నార్నూర్ మండలంలోని బారికరావుగూడ, ధన్నుగూడ, చిత్తగూడ గ్రామాలు బాహ్య ప్రపంచానికి దూరమయ్యాయి. గాదిగూడ మండలంలోని కొలమ వైపు వెళ్లే ప్రధాన రోడ్డు పూర్తిగా కోతకు గురైంది. డొంగర్‌గావ్, చిత్తగూడ, కట్టగూడ గ్రామాలకు వెళ్లే రోడ్లు దెబ్బతిన్నాయి. జైనథ్ మండల కేంద్రంలోని పలు కాలనీల్లోకి వరదనీరు చేరి పలువురి ఇళ్లలోని ధాన్యం, సామగ్రి తడిసిపోయింది. సోయా, పత్తి పంటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. భోరజ్ మండలంలో వాగులు, వంకలు పొంగి పొర్లుతుండగా పలుచోట్ల రాకపోకలు పూర్తిగా స్తంభించిపోయాయి. తర్ణం వాగు ఉధృతంగా ప్రవహిస్తుండగా వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. గిమ్మ వాగు వరద నీరు బ్రిడ్జి పైనుంచి వెళ్తుండగా కేదార్పూర్, కోరట, ఆకోలి గ్రామాలకు రాకపోకలు నిలిచాయి. బజార్‌హత్నూర్‌తోపాటు మండలంలోని కొలారి, కొలాంగూడ, భూతాయి, చింతలసాంగ్వి, మోర్కండి, మాడగూడ, కొత్తపల్లి గ్రామాల్లో వరదనీరు ఇళ్లల్లోకి చేరింది. పంటలు నీటమునిగాయి. తాంసి, వామన్‌నగర్, హస్నాపూర్ వాగులు ఉధృతంగా ప్రవహించగా రాకపోకలు నిలిచాయి. పొన్నారి లోలెవల్ వంతెన మునిగిపోయింది. తాంసి, భీంపూర్ మండలాలకు విద్యుత్ సరఫరా నిలిచింది. ఇచ్చోడ మండలంలోని గాయత్రి జలపాతానికి వెళ్లే గుండివాగు వద్ద వాగు పొంగిపొర్లడంతో రాకపోకలు స్తంభించాయి.

వరద ప్రాంతాలను పరిశీలించిన అనిల్ జాదవ్



వాగును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: భారీ వర్షాలు కురుస్తున్నందున బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మండలంలోని వాంకిడి వాగు, చెక్‌డ్యాంలను గురువారం పరిశీలించారు. మండల కేంద్రంలో నీటమునిగిన పలు కాలనీల్లో పర్యటించారు. బ్రిడ్జిలు, డ్రైనేజీలను పరిశీలించారు. అత్యవసరమైతేనే బయటకు రావాలని, వాగులు, వంకల వైపు వెళ్లొద్దని సూచించారు. మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, నాయకులు వెంకటరమణ, దేవేందర్‌రెడ్డి, సురేందర్, గులాబ్, సంతోష్, శాదాబ్, శ్రీధర్‌రెడ్డి, రవి ఉన్నారు.

ఒడ్డుకు చేరిన వాగులో చిక్కుకున్న వ్యక్తి



వాగులో చిక్కుకున్న జాదవ్ సంజు

ద్విచక్రవాహనంపై వెళ్తున్న నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలం దుప్పనాయక్ తండాకు చెందిన జాదవ్ సంజు కుప్టి–కుమారి మధ్య లోగల చిన్న వాగులో చిక్కుకున్నాడు. గ్రామస్తుల సమాచారం మేరకు ఎస్సై ఇమ్రాన్ ఖాన్ సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గ్రామ యువకులతో కలిసి తాడు సాయంతో అతడిని బయటకు చేర్చారు. ఈ సందర్భంగా అక్కడికి వచ్చిన తహసీల్దార్ ఎంఏ కలీమ్‌ను కల్వర్టుపై బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఆయన వెంట ఎంపీడీవో శేఖర్, ఆర్ఐ నాగోరావ్, పంచాయతీ కార్యదర్శి దత్తాద్రి, జూనియర్ అసిస్టెంట్ పెద్దులు ఉన్నారు.

ఆస్తి, ప్రాణనష్టం జరగకుండా చూడాలి

- కలెక్టర్లకు మంత్రి 'జూపల్లి' ఆదేశం
- భారీ వర్షాల నేపథ్యంలో సమీక్ష



ఫోన్‌లో మాట్లాడుతున్న జూపల్లి కృష్ణారావు

కైలాస్‌నగర్: అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండి ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా చర్యలు చేపట్టాలని ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశించారు. భారీ వర్షాల నేపథ్యంలో బుధవారం ఉమ్మడి జిల్లాలోని ఆయా కలెక్టర్లతో ఫోన్‌లో సమీక్షించారు. వర్షపాతం, వరద పరిస్థితులపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. యూరియా సరఫరా, కొరతపై ఆరా తీశారు. జైనథ్, సాత్నాల, మావల, ఆదిలాబాద్ టౌన్‌లో అత్యధిక వర్షపాతం నమోదైనట్లు కలెక్టర్ రాజర్షి షా మంత్రికి తెలిపారు. జైనథ్‌లో ఇళ్లలోకి నీరు చేరిందని, అక్కడి నుంచి బాధితులను ఇతర ప్రాంతానికి తరలించినట్లు పేర్కొన్నారు. వారికి భోజన వసతి కల్పించినట్లు చెప్పారు. తరోడలోని లోలెవల్ వంతెన పైనుంచి వరదనీరు ప్రవహిస్తుండగా ట్రాఫిక్ అంతరాయం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. అధికారులంతా అప్రమత్తంగా ఉన్నారని మంత్రికి వివరించారు.

తర్ణం వంతెనను పరిశీలించిన పాయల్



సాత్నాల: నీటి ఉధృతిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల్ శంకర్

సాత్నాల: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. భోరజ్ మండలం తర్ణం లోలెవెల్ వంతెనను ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ పరిశీలించారు. రాకపోకలు నిలిచిపోవడంతో వాహనదారుల ఇబ్బందులు తెలుసుకున్నారు.

పంట నష్టం గణన చేపట్టాలి

- కలెక్టర్ రాజర్షి షా
- అధికారులతో సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తున్న రాజర్షి షా

కైలాస్‌నగర్: పంట నష్టం గణన ప్రక్రియ వేగవంతం చేయాలని, నష్టపోయిన ప్రతి రైతుకూ పరిహారం అందించేలా ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ రాజర్షి షా ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో వ్యవసాయ, ఉద్యానవనశాఖ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పంట నష్టం సర్వే ప్రక్రియపై ఆరా తీసి వెంటనే నివేదికలు అందించాలని సూచించారు. మండలాల వారీగా ఇచ్చిన ఆయిల్‌పామ్ సాగు లక్ష్యాలను సాధించేలా చూడాలని తెలిపారు. యూరియా, ఇతర ఎరువుల కొరత లేకుండా చూడాలని, నానో యూరియాపై రైతులకు అవగాహన కల్పిస్తూ దాని లాభాల గురించి వివరించాలని సూచించారు. జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్‌స్వామి, డీసీవో మోహన్ తదితరులు పాల్గొన్నారు.

అత్యవసరమైతేనే బయటకు రావాలి



ఎస్పీకి వరద పరిస్థితి వివరిస్తున్న సీఐ స్వామి

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్‌రూరల్: అత్యవసరమైతేనే బయటకు రావాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. గురువారం జిల్లా కేంద్రంలోని వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించారు. పట్టణంలోని హరిఓం కాలనీలో తెగిన రోడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కల్వర్టు పైనుంచి వరదనీరు ప్రవహించేటపుడు వాహనదారులు, ప్రజలు దాటే ప్రయత్నం చేయవద్దని సూచించారు. ఎస్పీ వెంట మావల సీఐ కర్రె స్వామి ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో వేడుకలు జరుపుకోవాలి

గణేశ్ నవరాత్రోత్సవాలను భక్తిశ్రద్ధలతో ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. బుధవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌లో ప్రతిష్ఠించిన వినాయకుడికి పూజలు చేశారు. ఏఎస్పీ సురేందర్‌రావు, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, ఇంద్రవర్ధన్, ఇన్‌స్పెక్టర్లు వెంకటి, మురళి, చంద్రశేఖర్ తదితరులున్నారు.

ఎట్టకేలకు 'ప్రీప్రైమరీ'

- సెప్టెంబర్ 5 నుంచి తరగతులు
- జిల్లాలో 15 పాఠశాలల ఎంపిక
- ఇప్పటికే నాలుగు చోట్ల అమలు



ప్రీ ప్రైమరీ బోధన కొనసాగుతున్న జైనథ్ మండలం దీపాయిగూడ పాఠశాల

ఆదిలాబాద్‌టౌన్: ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమికవిద్య (ప్రీప్రైమరీ)ను ప్రారంభించేందుకు విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. సెప్టెంబర్ 5నుంచి తరగతులు ప్రారంభించేందుకు కసరత్తు చేస్తోంది. ఈ విద్యా సంవత్సరంలో అధికారులు జిల్లాలో 15పాఠశాలలను ఎంపిక చేశారు. పీఎంశ్రీ కింద ఎంపికైన నాలుగు స్కూళ్లలో గతేడాది నుంచే బోధన ప్రారంభించారు.

ఎంపికైన పాఠశాలలు

ప్రీప్రైమరీ బోధించేందుకు జిల్లాలో 15 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇందులో కేశవపట్నం, దుబ్బ (కె), కంఠ, దస్నాపూర్‌గూడ, వైజాపూర్, కేస్లాగూడ, బరంపూర్, రాంపూర్(పీ), మల్కాపూర్, చెర్లపల్లి, గుబిడి, యాపల్‌గూడ, రణదీవెనగర్, పిప్పల్‌కోటి (ఉర్దూ మీడియం), ఖుర్షాపూర్ పాఠశాలలున్నాయి. పీఎంశ్రీ కింద ఎంపికైన జైనథ్ మండలం దీపాయిగూడ, సిరికొండ మండల కేంద్రం, భీంపూర్ మండలం నిపాని, గాదిగూడలోని చింతగూడ పాఠశాలల్లో ఈ విద్యాసంవత్సరం నుంచి ప్రీప్రైమరీ తరగతులు నిర్వహిస్తున్నారు. ఉదయం 9నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆటాపాటలతో చిన్నారులకు ఇంగ్లిష్ మీడియంలో బోధిస్తున్నారు. స్లీపింగ్ హవర్, మధ్యాహ్న భోజనం అమలు చేస్తున్నారు.

సిబ్బంది నియామకం ఇలా..

ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాల నియామకానికి అధికారులు గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు నెలకు రూ.8వేలు, ఆయాకు రూ.6వేలు చెల్లించనున్నారు. ఇందుకు కలెక్టర్ చైర్మన్‌గా, డీఈవో కన్వీనర్‌గా, కలెక్టర్ నామినేట్ చేసిన ఒకరు, అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) సభ్యులుగా కమిటీ వేశారు. ఇన్‌స్ట్రక్టర్‌కు ఇంటర్, ఆయా పోస్టుకు ఏడో తరగతి అర్హత కాగా, 18–44 ఏళ్లలోపు మహిళలు అర్హులని పేర్కొన్నారు. ఒక్కో పాఠశాలకు ప్రభుత్వం రూ.1.70లక్షలు విడుదల చేసింది. ఇందులో రూ.1.50లక్షలు ఫర్నిచర్, పెయింటింగ్, బోధన పరికరాలు, ఇతర వస్తువుల కోసం ఖర్చు చేయనున్నారు. మిగతా రూ.20వేలు ఒక్కో విద్యార్థికి బూట్లు, యూనిఫాంల కోసం రూ.వెయ్యి చొప్పున వెచ్చించనున్నారు. 20 మంది విద్యార్థుల కంటే ఎక్కువగా ఉంటే అదనంగా ప్రభుత్వం బడ్జెట్ విడుదల చేయనుంది. 10 నెలల పాటు ఇన్‌స్ట్రక్టర్లు, ఆయాలకు గౌరవ వేతనం చెల్లించనుంది. ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు చదివిన విద్యార్థులు అదే పాఠశాలలో ఒకటో తరగతి చదివేలా అధికారులు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సదరు పాఠశాలలో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం వీరికీ అందించనున్నారు.

పాఠశాలల బలోపేతానికే..

ప్రభుత్వ పాఠశాలల్లో ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు లేకపోవడంతో ఆర్థికభారం అయినప్పటికీ చాలామంది తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం సర్కారు బడుల్లో ప్రీప్రైమరీ తరగతులు ప్రారంభిస్తోంది. దీంతో సర్కారు బడులు మరింత బలోపేతం కానున్నాయి. ఇక్కడ ఎల్‌కేజీ, యూకేజీ చదివిన పిల్లలకు వచ్చే విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో చేరేందుకు అర్హత ఉంటుంది. దీంతో విద్యార్థుల సంఖ్య పెరిగే అవకాశముంటుంది.

చర్యలు చేపడుతున్నాం

ప్రీప్రైమరీ పాఠశాలల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. ప్రభుత్వం జిల్లాకు రెండో విడతల్లో 15 ప్రీప్రైమరీ పాఠశాలలను ఎంపిక చేసింది. ప్రస్తుతం నాలుగు పాఠశాలల్లో తరగతులు కొనసాగుతున్నాయి. సిబ్బంది నియామకం కోసం నోటిఫికేషన్ విడుదలైంది. అర్హులు ఈ నెల 30లోపు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తు చేసుకోవాలి. సెప్టెంబర్ 5నుంచి తరగతులు ప్రారంభించేలా చర్యలు చేపడుతున్నాం.

– అజయ్, విద్యాశాఖ సెక్టోరియల్ అధికారి

క్లుప్తంగా

పిడుగుపడి ఒకరికి తీవ్రగాయాలు

కోటపల్లి: పిడుగుపడి ఒకరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని సర్వాయిపేట గ్రామానికి చెందిన దుర్గం రాజమల్లు గురువారం తన పొలంలో పనిచేస్తుండగా వర్షానికి పిడుగుపడడంతో శరీరంలో సగభాగం కాలిపోయింది. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించడంతో 108లో చెన్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి, మెరుగైన వైద్యం కోసం మంచిర్యాలకు తరలించారు. క్షతగాత్రుడిని బీజేపీ జిల్లా జనరల్ సెక్రటరీ దుర్గం అశోక్, మాజీ ఎంపీపీ మంత్రి రామయ్య సురేఖ పరామర్శించారు.

నకిలీ విలేకరి అరెస్టు

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో హల్‌చల్ చేసిన నకిలీ విలేకరితో పాటు అతని స్నేహితుడిని అరెస్టు చేసినట్లు ఎస్సై మజారొద్దీన్ తెలిపారు. మంచిర్యాలకు చెందిన సయ్యద్ సిరాజ్ ఓ టీవీ చానల్ పేరుతో ఫేక్ ఐడీ కార్డు సృష్టించుకున్నాడు. ఈ నెల 27న తన స్నేహితుడు బండి సాయికిరణ్‌తో కలిసి జిల్లా కేంద్రంలోని ఓం సాయి శ్రీనివాస బార్ అండ్ రెస్టారెంట్‌లో మద్యం సేవించాడు. బిల్లు అడిగితే విలేకరినని బెదిరించడంతో రెస్టారెంట్ యజమాని గురువిందర్ సింగ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సిరాజ్, సాయికిరణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలు

నిర్మల్‌టౌన్: పోక్సో కేసులో ఒకరికి ఐదేళ్ల జైలుశిక్ష, రూ.వెయ్యి జరిమానా విధిస్తూ జిల్లా జడ్జి శ్రీవాణి గురువారం తీర్పునిచ్చినట్లు కోర్టు సమన్వయ అధికారి డల్లు సింగ్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని వెంకటాపూర్ కాలనీకి చెందిన సంజీవ్ తన సమీప బంధువైన బాలిక (7)పై అత్యాచారానికి పాల్పడ్డాడు. చిన్నారి కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని కోర్టులో హాజరుపరిచారు

మద్యం మత్తులో మహిళపై దాడి

మందమర్రిరూరల్: మద్యం మత్తులో మహిళపై దాడి చేసిన ఘటన మందమర్రిలో చోటు చేసుకుంది. ఎస్సై రాజశేఖర్ తెలిపిన వివరాల మేరకు పట్టణంలోని ఫస్ట్ జోన్‌కు చెందిన సింగరేణి ఉద్యోగి శ్రీకాంత్ గురువారం తన ఇంటి ముందు నివాసముండే మహిళను పప్పు ఉడికిందా లేదా చూడాలని పిలిచాడు. లోపలికి రాగానే తలుపులు మూసి చేతులతో కొడుతూ అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమె భయంతో గట్టిగా అరవడంతో మహిళ కోడలు వచ్చి ఇంటి తలుపు తట్టడంతో గోడదూకి పారిపోయాడు. స్థానికులు పట్టుకుని చెట్టుకు కట్టేయడంతో మహిళలు దేహశుద్ధి చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాగులో చిక్కుకున్న ఎడ్లు

ఆదిలాబాద్‌రూరల్: రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షానికి మండలంలోని వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. చాందా (టి) శివారు ప్రాంతంలోని వాగులో రెండు ఎడ్లు చిక్కుకున్నాయి. రెవెన్యూ సిబ్బంది ఎన్డీఆర్ఎఫ్‌కు సమాచారం అందించడంతో రక్షించారు.

కృష్ణా ఎక్స్‌ప్రెస్ దారి మళ్లింపు

ఆదిలాబాద్: భారీ వర్షాల కారణంగా భిక్కనూరు–తాళ్లమడ్ల సెక్షన్, అకంపేట్–మెదక్ సెక్షన్లో రైల్వే ట్రాక్‌లపై నీరు చేరడంతో ఆదిలాబాద్–తిరుపతి, తిరుపతి–ఆదిలాబాద్ మధ్య నడిచే కృష్ణా ఎక్స్‌ప్రెస్ సర్వీసులను గురువారం దారి మళ్లించినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్ఓ శ్రీధర్ ప్రకటనలో పేర్కొన్నారు. తిరుపతి–ఆదిలాబాద్ మధ్య నడిచే 17405 సర్వీసు చర్లపల్లి, సికింద్రాబాద్, వికారాబాద్, పర్లి వైద్యనాథ్, పర్బని పూర్ణా, ముద్ ఖేడ్ మీదుగా నడిచిందని తెలిపారు. ఆదిలాబాద్–తిరుపతి మధ్య నడిచే 17406 సర్వీస్ నిజామాబాద్, పెద్దపల్లి, వరంగల్ మీదుగా దారి మళ్లించినట్లు పేర్కొన్నారు. ప్రయాణికులు ఎప్పటికప్పుడు రైల్వే సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు.

రూ.6.37 లక్షలు కాజేసిన సైబర్ మోసగాళ్లు

మందమర్రిరూరల్: పట్టణంలోని ప్రాణహిత కాలనీకి చెందిన ఓ మహిళ సైబర్ మోసగాళ్ల ఉచ్చులోపడి రూ.6,37,760 మోసపోయింది. సదరు మహిళ ఎన్సీఆర్పీలో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. ప్రాణహిత కాలనీకి చెందిన ఓ మహిళ 3 మే 2025న ఇన్‌స్టాగాం ఖాతాలో పెట్టిన పెట్టుబడికి రెట్టింపు చెల్లిస్తామని ఒక ప్రకటన చూసింది. లింక్‌పై క్లిక్ చేయగా సైబర్ నేరగాళ్లు టెలిగ్రామ్ యాప్‌లో చేరాలని సూచించారు. మొదట రూ.5 వేలు ఆమె ఖాతాలో జమ అయినట్లు చూపించారు. కానీ విత్ డ్రా చేసుకోవడానికి వీలులేకుండా చేశారు. మీ అకౌంట్ వివరాలు తమవద్ద ఉన్నాయని మరింత డబ్బు పంపాలని ఒత్తిడి చేశారు. తన వద్ద ఉన్న డబ్బుతో పాటు తన స్నేహితుల ద్వారా కూడా డబ్బును పంపించింది. తిరిగి డబ్బు పంపాలని అడిగితే ఆమె అకౌంట్ హోల్డ్ అయిందని అన్‌హోల్డ్ చేయాలంటే మరింత డబ్బు కావాలని ఒత్తిడి చేయడంతో మోసపోయానని గుర్తించి నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్సీఆర్పీ)కు ఫిర్యాదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

‘మత్తడివాగు’ నాలుగు గేట్లు ఎత్తివేత



గేట్లు ఎత్తడంతో దిగువకు వెళ్తున్న వరదనీరు

రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆదిలాబాద్ జిల్లా తాంసి మండలంలోని వడ్డాడి మత్తడివాగు ప్రాజెక్టులోకి భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. ఇన్‌ఫ్లో ద్వారా 22,858 క్యూసెక్కుల వరదనీరు రాగా నాలుగు గేట్లను ఎత్తి 22,858 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నట్లు ప్రాజెక్టు ఏఈ హరీశ్ కుమార్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 277.50 మీటర్లు కాగా 277.40 మీటర్ల నీరు నిల్వ ఉండే విధంగా నీటిని దిగువకు వదులుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. – తాంసి

‘సాత్నాల’ నీటి విడుదల



ఉరకలు వేస్తూ వెళ్తున్న వరదనీరు

రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు సాత్నాల ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. గురువారం 7,305 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండడంతో ప్రాజెక్టు అధికారులు మూడు గేట్లను ఎత్తి 7,305 క్యూసెక్కుల నీటిని దిగువకు వదిలినట్లు జేఈ దీపక్ తెలిపారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిసామర్థ్యం 1.24 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.046 టీఎంసీలు ఉంది. నది పరీవాహక ప్రాంతాల్లోకి పశువులను వదలకూడదని ఆయన సూచించారు. – సాత్నాల

‘కడెం’ పది గేట్లు ఎత్తివేత



కడెం ప్రాజెక్ట్ నుంచి దిగువకు వెళ్తున్న నీళ్లు

ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో కడెం ప్రాజెక్ట్‌కు వరద పోటెత్తింది. గురువారం రాత్రి ప్రాజెక్ట్‌కు 70,872 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో అప్రమత్తమైన అధికారులు పది గేట్లు ఎత్తి 99,179 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా ప్రస్తుతం 694.525 అడుగుల నీటిమట్టం ఉంది. – కడెం

రోడ్డు ప్రమాదంలో సీఐకి గాయాలు

సాత్నాల: ఆదిలాబాద్ జిల్లా భోరజ్ మండలం డోలారా గ్రామం వద్ద గురువారం ఉదయం 11గంటలకు జరిగిన రోడ్డు ప్రమాదంలో సీఐ, డ్రైవర్ తీవ్రంగా గాయపడ్డారు. ఎస్సై గౌతమ్ పవార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెన్‌గంగ నదిలో వినాయక నిమజ్జనానికి కుటుంబ సమేతంగా భక్తులు భారీగా హాజరయ్యారు. భద్రత పర్యవేక్షణకు సీఐ సాయినాథ్ డ్రైవర్ షబ్బీర్‌తో కలిసి వాహనంలో వెళ్లారు. రాష్ట్ర సరిహద్దు నుంచి పరిశీలిస్తూ డోలారా గ్రామం వద్ద ఆగి ఉన్నారు. ఇంతలో గురుగావ్ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న మహారాష్ట్రకు చెందిన లారీ వేగంగా వచ్చి సీఐ వాహనాన్ని ఢీకొట్టింది. దీంతో అందులో ఉన్న సీఐ, డ్రైవర్ ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. వాహనం నుజ్జునుజ్జయింది. ఇద్దరిని ఆదిలాబాద్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. గాయపడిన వారిని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, డీఎస్పీ జీవన్ రెడ్డి పరామర్శించి ఆరోగ్య స్థితిపై వివరాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు వెల్లడించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.



సీఐ ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుంటున్న ఎస్పీ అఖిల్ మహాజన్

అత్త వేధింపులు భరించలేక కోడలు ఆత్మహత్య

చెన్నూర్‌రూరల్: అత్త వేధింపులు భరించలేక కోడలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్యాంపటేల్ తెలిపిన వివరాల మేరకు భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని సూరారంకు చెందిన రవళి (37)కి ఎర్రగుంటపల్లికి చెందిన తోడె రవితో తొమ్మిదేళ్ల క్రితం వివాహమైంది. పెళ్లిలో తాను పెట్టిన బంగారం తిరిగి తనకు ఇవ్వాలని అత్త రాజుబాయి నిత్యం రవళిని వేధింపులకు గురిచేస్తుండేది. గురువారం ఇద్దరు పిల్లలకు లంచ్ బాక్స్ పెట్టి స్కూల్‌కు పంపించింది. భర్త విధులకు వెళ్లిన తరువాత అత్తతో గొడవ జరిగింది. దీంతో మనస్తాపం చెంది ఇంట్లో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో ఎస్సై సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చెన్నూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తల్లి చల్ల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

అప్పుల బాధతో స్టీల్ వ్యాపారి బలవన్మరణం

జైపూర్: పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని మేదరిబస్తీకి చెందిన స్టీల్ వ్యాపారి బైస విజయ్ (43) ఈనెల 23న గోదావరిఖని బ్రిడ్జిపై చెప్పులు విడిచి నదిలో దూకాడు. ఈనెల 27న జైపూర్ మండలంలోని టేకుమట్ల సమీపంలో గోదావరి ఒడ్డున మృతదేహం గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆరాతీయగా పెద్దపల్లి జిల్లా గోదావరిఖనికి చెందిన విజయ్‌గా గుర్తించారు. గోదావరిఖనిలో షాపు నిర్వహిస్తున్న విజయ్ తన వ్యాపారం సరిగ్గా నడవకపోవడంతో అప్పులు తీర్చేమార్గంలేక నదిలో దూకి ఆత్మహత్యకు పాల్పడినట్లు పేర్కొన్నారు. మృతునికి భార్య కల్యాణి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై బాలయ్య తెలిపారు.

యువకుడు ఆత్మహత్య



సంపత్ (ఫైల్)

జైపూర్: అప్పుల బాధతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మండలంలోని గంగిపల్లి గ్రామానికి చెందిన జలంపల్లి సంపత్(32) కూలీ పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. వీరికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాగా నిర్మించుకుంటున్నారు. ఇంటి నిర్మాణం కోసం బంధువుల వద్ద రూ.3 లక్షలు అప్పులు తెచ్చారు. తీర్చడం ఎలా అంటూ భార్య సంకీర్తనతో చెప్తూ బాధపడుతుండేవాడు. ఈనెల 26న జైపూర్ వెలిశాల మల్లన్న గుడి సమీపంలో గడ్డి మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. స్థానికుల సమాచారంతో మంచిర్యాలకు, మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించగా చికిత్స పొందుతూ 27న మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఏఎస్సై బాలయ్య తెలిపారు.

రైలు కిందపడి వృద్ధురాలు..

మంచిర్యాలక్రైం: మనస్తాపంతో రైలు కిందపడి వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ సంపత్ తెలిపిన వివరాల ప్రకారం స్థానిక పాత గర్మిళ్లకు చెందిన వైద్య సత్తమ్మ(78) భర్త చంద్రయ్య, ముగ్గురు కుమారులు, కోడలు కొంతకాలం క్రితం వేర్వేరు కారణాలతో మృతి చెందారు. దీంతో మనస్తాపానికి గురైన వృద్ధురాలు మంచిర్యాల–పెద్దపేట రైల్వేస్టేషన్‌ల మధ్య గుర్తు తెలియని రైలు కింద పడి బలవన్మరణానికి పాల్పడింది. రెండో కోడలు విజయ ఇచ్చిన ఫిర్యాదు ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు జీఆర్పీ హెడ్ కానిస్టేబుల్ తెలిపారు.

ఉరేసుకుని ఒకరు..

భైంసాటౌన్: పట్టణంలోని గడ్డెన్నవాగు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఒకరు ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు. ఇలేగాంకు చెందిన వీరేశ్ సోమవారం కుంటాల మండలం విట్టాపూర్‌లోని అత్తగారింటికి వెళ్లాడు. మంగళవారం అక్కడి నుంచి బయలుదేరి వచ్చాడు. సాయంత్రం భార్య ఇంటికి వచ్చినా వీరేశ్ రాకపోవడంతో ఆచూకీ కోసం వెతికారు. ఫలితం లేకపోవడంతో బుధవారం గాలింపు చేపట్టడంతో భైంసాలోని గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలో బైక్ కనిపించింది. దీంతో ఆ ప్రాంతంలో వెతకగా చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. ఇంటి కోసం ఓ ఫైనాన్స్ సంస్థలో రుణం తీసుకున్నాడని, వారి వేధింపుల కారణంగానే ఆత్మహత్యకు పాల్పడ్డాడని కుటుంబీకులు ఆరోపించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవనీత్ రెడ్డి తెలిపారు.

నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించిన నలుగురిపై కేసు

ఇంద్రవెల్లి: నకిలీ సర్టిఫికెట్లు ఇప్పించిన ఘటనలో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు ఉట్నూర్ సీఐ మడావి ప్రసాద్ తెలిపారు. బుధవారం రాత్రి మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రాజస్థాన్‌కు చెందిన జతిన్‌సింగ్‌కు సెంట్రల్ ఫోర్స్‌లో ఉద్యోగంకోసం ఇంద్రవెల్లి చిరునామాపై రెసిడెన్స్ సర్టిఫికెట్ అవసరమైంది. మండల కేంద్రంలోని కొబ్బయ్‌గూడకు చెందిన గేడం భరత్‌ను కలిసి విషయం చెప్పడంతో రూ.15 వేలకు ఒప్పందం కుదుర్చుకుని జతిన్‌సింగ్ ఆధార్ కార్డుపై రాజస్థాన్ అడ్రస్‌కు బదులుగా ఇంటినంబర్ 1–42, కొబ్బయ్‌గూడ, ఇంద్రవెల్లి అని మార్పు చేసి తహసీల్దార్ కార్యాలయం నుంచి సర్టిఫికెట్ ఇప్పించాడు. విషయం తెలుసుకున్న భీంనగర్‌కు చెందిన ఆచార్య దత్త విషయం బయటకు రాకుండా ఉండాలంటే డబ్బులు ఇప్పించాలని డిమాండ్ చేయడంతో అతని స్నేహితుడు భరత్‌సింగ్ ద్వారా రూ.10వేలు ఇప్పించాడు. విచారణలో సర్టిఫికెట్ నకిలీదని తేలడంతో ఇంద్రవెల్లి ఎస్‌బీ కానిస్టేబుల్ కొడప రామారావు ఫిర్యాదు మేరకు నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ ప్రసాద్

దాడి చేసిన ఒకరిపై కేసు

మందమర్రిరూరల్: మందమర్రి పోలీస్‌స్టేషన్ పరిధిలోని విద్యానగర్‌లో ఒకరిపై దాడి చేసిన నిందితుడిని బుధవారం అరెస్ట్ చేసినట్లు ఎస్సై రాజశేఖర్ తెలిపారు. విద్యానగర్‌కు చెందిన మొండి భార్య రెండేళ్లక్రితం అదే కాలనీకి చెందిన నరేందర్‌కు కొంత అప్పు ఇచ్చింది. ఆమె మరణించడంతో అప్పు చెల్లించాలని మొండి తరచూ అడుగుతున్నాడు. దీంతో ఈ నెల 25న రాత్రి మొండి ఇంట్లో నిద్రిస్తుండగా స్టీల్‌పైపుతో దాడి చేసి గాయపరిచాడు. మొండి కూతురు రజిత ఫిర్యాదు మేరకు నరేందర్‌పై కేసు నమోదు చేసిరిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

మహిళను బెదిరించిన ఇద్దరిపై ..

రెబ్బెన: మహిళను బెదిరించి డబ్బులు వసూలు చేసిన ఇద్దరిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై చంద్రశేఖర్ తెలిపారు. నంబాలకు చెందిన మహిళను అదే గ్రామానికి చెందిన పెండ్యాల హరీష్ మాయమాటలు చెప్పి డబ్బులు వసూలు చేసి కారు కొనుగోలు చేసి జల్సాలు చేశాడు. అదే గ్రామానికి చెందిన పుప్పాల కమలాకర్ అతనికి సహకరించాడు. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

నిందితుడికి జీవితఖైదు

ఆదిలాబాద్‌టౌన్: మహిళపై అత్యాచార యత్నం, హత్యాయత్నం చేసిన నిందితుడికి ఎస్సీ, ఎస్టీ కోర్టు జడ్జి కుమార్ వివేక్ జీవిత ఖైదుతో పాటు రూ.15వేల జరిమానా విధిస్తూ గురువారం తీర్పునిచ్చినట్లు లైజన్ అధికారి ఈశ్వర్‌సింగ్ తెలిపారు. జైనూర్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన మహిళ 2024 ఆగస్టు 31న అదే మండలానికి చెందిన ఆటోడ్రైవర్ షేక్ మగ్దూమ్ ఆటోలో తన ఊరికి బయల్దేరి వెళ్లింది. ఆటోడ్రైవర్ అటవీ ప్రాంతంలో ఆపి ఆమెపై అత్యాచార యత్నానికి పాల్పడ్డాడు. మహిళ భయపడి కేకలు వేయడంతో రాడ్‌తో తలపై కొట్టడంతో స్పృహతప్పి పడిపోయింది. చనిపోయిందని భావించి అక్కడినుంచి వెళ్లిపోయాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం జైనూర్, ఆ తర్వాత జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా స్పృహలోకి వచ్చింది. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అప్పటి డీఎస్పీ కరుణాకర్ చార్జిషీట్ దాఖలు చేశారు.

ఒకరి రిమాండ్

బజార్‌హత్నూర్: నకిలీ ధ్రువీకరణ పత్రాలతో వ్యవసాయ భూమిని పట్టా చేసుకున్న మండలంలోని గిర్నూర్ గ్రామానికి చెందిన మేకల గంగయ్యను గురువారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వెంకటేశ్వర్‌రావ్ తెలిపారు. చట్టాన్ని ఉల్లంఘిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎస్సై సంజయ్‌కుమార్ పాల్గొన్నారు.

చోరీ కేసులో ఒకరు..

కుభీర్: మండలంలోని హల్దా గ్రామంలో సురం మల్లేశ్ నివాసంలో చోరీకి పాల్పడిన అదే గ్రామానికి చెందిన సిమాల్ విఠల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై క్రిష్టారెడ్డి తెలిపారు. ఈ నెల 26న సురం మల్లేశ్ ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలిసి లక్ష్మణచాందకు వెళ్లాడు. సాయంత్రం వచ్చి చూడగా ఇంటితాళం పగులగొట్టి ఉంది. 27న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా క్లూస్ టీం, ఫింగర్ ప్రింట్ నిపుణులు వచ్చి ఆధారాలు సేకరించారు. పోలీసులు గురువారం ఉదయం గ్రామానికి వెళ్లగా పోలీసులను చూసి విఠల్ పారిపోతుండగా పట్టుకున్నారు. విచారించగా నేరం చేసినట్లు ఒప్పుకుని పొదలో దాచిపెట్టిన బంగారు కమ్మలు, మాటీలు చూయించాడు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

దహెగాం: మండలంలోని బొర్లకుంట సమీపంలోని పెద్దవాగులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం కొట్టుకువచ్చినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం.. బుధవారం పెద్దవాగులో మృతదేహం కనిపించడంతో గమనించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించినట్లు ఆయన పేర్కొన్నారు. వాగు వద్దకు వెళ్లి పరిశీలించగా మృతుడు నీలిరంగు షర్టు, యాష్‌కలర్ ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. మృతదేహాన్ని కాగజ్‌నగర్‌లోని మార్చురీకి తరలించినట్లు తెలిపారు.

అతిగా మద్యం సేవించి ఒకరు మృతి

బెజ్జూర్: అతిగా మద్యం సేవించి ఒకరు మృతి చెందినట్లు ఎస్సై సర్తాజ్ పాషా తెలిపారు. బెజ్జూర్ మండలంలోని ఎలుకపల్లి(బి)కి చెందిన నికాడి వసంత్ (35)ఈనెల 26న పొలాల, బొడగాకు వెళ్లి ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం ఎలుకపల్లికి చెందిన మాండూరి మల్లేశ్ పత్తి చేనులో మృతదేహం గుర్తించారు. మృతుని భార్య కళావతి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

చికిత్స పొందుతూ యువకుడు..

కుభీర్: మండలంలోని సోనారి గ్రామానికి చెందిన కె.రమణ (20) ఈనెల 22న బైక్‌పై నుంచి కిందపడడంతో గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ముందుగా భైంసాకు, ఆతర్వాత హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం రాత్రి మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు.

కాలువలో పడిఒకరు..

జన్నారం: ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలోపడి ఒకరు మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల మేరకు మండలంలోని మొర్రిగూడకు చెందిన బాదావత్ గంగాధర్ (25) బుధవారం కూలిపనికి వెళ్లి ఇంటికి రాలేదు. గురువారం ఉదయం కడెం కెనాల్ 12వ డిస్ట్రిబ్యూటర్ పిల్ల కాలువలో మృతదేహాన్ని గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ప్రమాదవశాత్తు కాలుజారి కాలువలో పడి మృతి చెందాడని మృతుని భార్య మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

చిరుతపులి కలకలం...

- లింగాల అడవిలో మేకపై దాడి
- నీల్వాయి రేంజ్ వైపు పయనం

వేమనపల్లి/భీమిని: రెండు రోజులుగా లింగాల అటవీ సెక్షన్ నాగారం బీట్‌లలో చిరుత పులి సంచారం స్థానికులను భయాందోళనకు గురి చేస్తోంది. మంగళవారం రాత్రి లింగాల గ్రామ సమీపంలోకి వచ్చిన చిరుతను చూసి కుక్కలు అరవడంతో సమీప అటవీ ప్రాంతంలోకి వెళ్లినట్లు గ్రామస్తులు పేర్కొన్నారు. బుధవారం మధ్యాహ్నం లింగాల, నాగారం రోడ్డువైపు దసలిపురుగుల పెంపకం క్షేత్రం సమీపంలో ఎల్కరి మధునయ్యకు చెందిన మేకపై దాడి చేసి హతమార్చింది. మేకల కాపరులు చౌదరి బాపు, జిల్లపెల్లి సంతోష్ కేకలు వేయడంతో అడవిలోకి పరుగులు తీసింది. అటవీశాఖ అధికారులకు సమాచారం అందించడంతో అటవీ ప్రాంతంలోకి, పంటచేలలోకి ఒంటరిగా వెళ్లవద్దని ఆదేశించారు. నాగారాం, జక్కెపల్లి, జిల్లెడ, లింగాల, చింతపుడి, నాయకునిపేట గ్రామాల్లో డప్పు చాటింపు వేయించారు. గురువారం అటవీశాఖ అధికారులు లింగాల, నాగారం అటవీ బీట్‌లలో చిరుత కదలికలపై పరిశీలించి నీల్వాయి అటవీ రేంజ్ వైపు వెళ్లినట్లు నిర్ధారణకు వచ్చారు.

ముగిసిన ‘నవోదయ’ దరఖాస్తు గడువు

- ఈ నెల 30 వరకు సవరణలకు అవకాశం

కాగజ్‌నగర్‌టౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ జవహర్ నవోదయ విద్యాలయంలో 2026–27 విద్యాసంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి గడువు ఈనెల 27 వరకు ముగిసినట్లు ప్రిన్సిపాల్ రేపాల కృష్ణ పేర్కొన్నారు. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో 6,197 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. చెన్నూర్‌లో 277, ఖానాపూర్‌లో 289, మంచిర్యాలలో 533, కాగజ్‌నగర్‌లో 642, సిర్పూర్‌లో 382, ఆదిలాబాద్‌లో 590, బెల్లంపల్లిలో 275, బోథ్‌లో 321, నిర్మల్‌లో 595, భైంసాలో 668, లక్సెట్టిపేటలో 354, మందమర్రిలో 283, ఉట్నూర్‌లో 379, ఆసిఫాబాద్‌లో 608 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

ఎడిట్ ఆప్షన్‌కు గడువు

అభ్యర్థులు దరఖాస్తుల్లో తప్పులను ఈనెల 30 వరకు ఎడిట్ ఆప్షన్‌తో సవరించుకోవచ్చు. దరఖాస్తు ఫారంలో ఎడిట్ చేసుకోవడానికి విద్యార్థి పేరు, తల్లి/ తండ్రి పేరు, పుట్టిన తేది, లింగం, జాతీయత/ కులం, చిరునామా, పాఠశాల వివరాలు వాటిని ఎడిట్ చేసుకునేందుకు అవకాశం కల్పించారు.

తప్పులు సవరించుకోవాలి

దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు తప్పులను సవరించుకునేందుకు ఈ నెల 30 వరకు ఆన్‌లైన్‌లో ఎడిట్ ఆప్షన్‌లో అవకాశం కల్పించారు. బాలికలు 3031, బాలురు 3058 ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోగా 6,196 దరఖాస్తులు వచ్చాయి. డిసెంబర్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుంది. – రేపాల కృష్ణ, ప్రిన్సిపాల్, నవోదయ విద్యాలయం

35 శాతం లాభాల వాటా చెల్లించాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికులకు కంపెనీ సాధించిన లాభాల నుంచి 35 శాతం వాటా చెల్లించాలని డిమాండ్ చేస్తూ గురువారం టీబీజీకేఎస్ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఏరియాలోని పలు గనులు, డిపార్టుమెంట్లపై నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. అనంతరం మేనేజర్లకు వినతిపత్రాలు అందజేశారు. ఎస్సార్పీ 3 గనిపై జరిగిన కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ సింగరేణిలో కార్మికులకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని, 36 నెలల సర్వీసు ఉండగానే మెడికల్ బోర్డుకు పిలవాలని, తెలంగాణ ప్రాంతంలోని బొగ్గు గనులను సింగరేణికే కేటాయించాలని, గనుల వేలం విధానాన్ని రద్దు చేయాలని, సింగరేణికి రాష్ట్ర ప్రభుత్వ సంస్థల నుండి చెల్లించాల్సిన రూ. 43 వేల కోట్ల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఆ యూనియన్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు బండి రమేశ్, కేంద్ర కమిటీ నాయకులు పెట్టం లక్ష్మణ్, పొగాకు రమేశ్, పానుగంటి సత్తయ్య, అన్వేష్ రెడ్డి, బుస్సు రమేశ్, నాయకులు గొర్ల సంతోష్, గద్దం మల్లయ్య, తొంగల రమేశ్, అందే రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి

కాంట్రాక్ట్ కార్మికులకు ఈఎస్ఐ వైద్యం

శ్రీరాంపూర్: సింగరేణిలో కాంట్రాక్ట్ కార్మికులకు రెండు నెలల్లో ఈఎస్ఐ వైద్య సదుపాయం కల్పించబోతున్నారని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య తెలిపారు. గురువారం నస్పూర్ కాలనీలోని సివిల్ డిపార్టుమెంట్ వద్ద పలువురు కాంట్రాక్ట్ కార్మికులు ఏఐటీయూసీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంపెనీలో 33 వేల మంది కాంట్రాక్ట్ కార్మికులు పని చేస్తున్నారని వీరికి కనీస వేతనాలు అందడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కే సమ్మయ్య, బ్రాంచి కార్యదర్శి షేక్ బాజీసైదా, సహాయ కార్యదర్శి మోతుకూరి కొమురయ్య, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వాసిరెడ్డి సీతారామయ్య

సినీఫక్కీలో ఆర్మీ జవాన్ కిడ్నాప్..

గుడిహత్నూర్: సినీ ఫక్కీలో కిడ్నాప్‌కు గురైన ఓ ఆర్మీ జవాన్‌ను పోలీసులు కాపాడిన సంఘటన మండలంలో కలకలం రేపింది. ఎస్సై శ్రీకాంత్ తెలిపిన ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి.. ఆసిఫాబాద్ జిల్లా కెరమెరి మండలానికి చెందిన ఆర్మీ జవాను శివప్రసాద్ మంగళవారం మన్నూర్‌లో ఉండే తన సోదరి ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న ఇచ్చోడ మండలం నర్సాపూర్‌కు చెందిన ఆరుగురు వ్యక్తులు రాత్రి షిఫ్ట్ డిజైర్, బొలెరో పికప్ వాహనాల్లో వచ్చి అతన్ని కిడ్నాప్ చేసి కారులో తీసుకెళ్లారు. గమనించిన బంధువు కరాడ్ సచిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు వెంటనే దర్యాప్తు ప్రారంభించారు. రాత్రి ఒంటిగంట సమయంలో శివప్రసాద్ సెల్‌ఫోన్ లొకేషన్ ఆధారంగా నర్సాపూర్‌లో ఉన్నట్లు గుర్తించి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. కాగా నర్సాపూర్ గ్రామానికి చెందిన తమ బంధువుల పరువు తీస్తున్నాడన్న కారణంతో శివప్రసాద్‌ను కిడ్నాప్ చేసి తీసుకెళ్లి చిత్రహింసలకు గురి చేసినట్లు తెలుస్తోంది. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

యువకుడు అరెస్ట్

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని రైల్వేస్టేషన్‌లో గంజాయి తరలిస్తున్న యువకుడిని అరెస్ట్ చేసినట్లు ఎస్సై తిరుపతి తెలిపారు. సీఐ ప్రమోద్‌రావుకు అందిన సమాచారం మేరకు గురువారం ఉదయం రైల్వే స్టేషన్‌లో జైపూర్ మండలంలోని నర్వ గ్రామానికి చెందిన దూట అభిలాష్‌ను అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా అతని వద్ద 110 గ్రాముల గంజాయి లభించింది. విచారణలో మహారాష్ట్రలోని బల్లార్షలో కొనుగోలు చేసినట్లు ఒప్పుకున్నాడు.

పేకాడుతున్న ఐదుగురు..

శ్రీరాంపూర్: పేకాడుతున్న ఐదుగురిని గురువారం అరెస్టు చేసినట్లు ఎస్సై ఉపేందర్‌రావు తెలిపారు. న్యూనార్జున కాలనీలోని సింగరేణి క్వార్టర్ 3204లో పేకాడుతున్నారని తమకు సమాచారం రావడంతో దాడి చేసి సల్లూరి రాజ్‌కుమార్, ఆవుల శ్రీనివాస్, బొజ్జం రాజు, ఇరగదిండ్ల రవి, ఎండీ రిజ్వాన్‌ను అరెస్ట్ చేసినట్లు పేర్కొన్నారు. వారి వద్ద నుంచి రూ. 25,730 నగదు, 3 సెల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

ఓటును మార్పిడి చేసిన నలుగురు..

ఇచ్చోడ: ఫోర్జరీ పత్రాలతో అడేగామ(బి) మాజీ సర్పంచ్ కదం వనిత, ఆమె భర్త కదం సుభాష్ ఓట్లను ఇచ్చోడకు మార్చిన సంఘటనలో నలుగురిని అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ బండారి రాజు తెలిపారు. గురువారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. బాధితుల ప్రమేయంలేకుండా కదం విశాల్, సిందే అచ్యుత్, కదం దనరాజ్, ఆర్ఐ హుస్సెస్ ఫోర్జరీ నివాస ధ్రువీకరణ పత్రాలు సృష్టించి మండల కేంద్రంలోని 137 పోలింగ్ బూత్‌లోకి మార్చారని తెలిపారు. ప్రాథమిక విచారణ అనంతరం నలుగురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు.